టీడీపీని చిత్తుగా ఓడించండి

- చంద్రబాబుకు బై బై చెప్పండి
- సంక్షేమ ప్రదాత జగన్‌కు పట్టంకట్టండి
- ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప

మడకశిర: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని చిత్తుగా ఓడించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణంలోని ఈరలక్కప్ప ఇంటి ఆవరణంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు బై బై చెప్పాలన్నారు. టీడీపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కకుండా చేయాలన్నారు. చంద్రబాబు తప్పుడు హామీలతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు మాయమాటలను ఎవరూ నమ్మవద్దని కోరారు. ఎన్నికల్లో హామీలు గుప్పించడం, అధికారంలోకి రాగానే హామీలను పట్టించుకోకపోవడం చంద్రబాబు నైజమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి పేదలను ఆదుకున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పేదలను ముంచే కూటమని విమర్శించారు. ఈ మూడు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ లేదు. 'ఆ పెద్దాయనను నమ్మి మోసపోవద్దని పరోక్షంగా మాజీ మంత్రి రఘువీరను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ విమర్శించారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు రామిరెడ్డి, పుట్టకామప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, జెడ్పీటీసీ సభ్యులు అనంతరాజు, సరోజమ్మ, భూతరాజు, ఎంపీపీ కవిత, డైరెక్టర్లు రామకృష్ణ, నాగరాజగౌడ్, జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్రయాదవ్, విక్రమ్, రాష్ట్ర బీసీ కమిటీ సభ్యులు బేకరి నాగరాజు, రాజేష్, సత్యనారాయణ, శ్రీరాములు, మాజీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీనరసింహారెడ్డి, నియోజకవర్గ బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండలస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారు పార్టీ శ్రేణులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్ప, సింగల్ విండో అధ్యక్షుడు జయరాం, కోఆప్షన్ సభ్యుడు నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురంలో ఉత్సాహంగా ర్యాలీ

అమరాపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి బస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక వీరశైవ కల్యాణ మంటపంలో మండల వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని వారు దిశా నిర్దేశం చేశారు. టీడీపీ నాయకులు ఆరు గ్యారెంటీ స్కీములు అమలని ఊదరగొడుతున్నారని, అయితే పొరపాటున వారి మాటాలు నమ్మి ఓటు వేస్తే వచ్చే ఐదేళ్లు ఒక్క పథకం కూడా అమలు కాదన్నారు. గతంలో ఆచరణకు సాధ్యంకాని హామీల్చి చంద్రబాబు అందరినీ మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వాగేష్, వైస్ ఎంపీపీలు లలితమ్మ, కృష్ణమూర్తి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు వీరక్యాతరాయప్ప, గగన, నేత్రావతి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్పలతో కలసి వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌కు ప్రజాశీస్సులు మెండుగా ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమన్నారు. జేసీఎస్ మండల కన్వీనర్ కొంకల్లు శివకుమార్, సర్పంచులు కరుణాకర్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.


అమరాపురంలో ర్యాలీగా వెళుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

రొళ్ల: పట్టణ సమీపంలోని మడకశిర ప్రధాన రోడ్డులోని శ్రీలక్ష్మీ ప్యాలెస్ కల్యాణ మంటపం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అంతకు ముందు రొళ్ల పట్టణంలోని రత్నగిరి ప్రధాన రోడ్డులో శాంతమ్మ చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించి స్వీట్లను పంచి పెట్టారు. డైరెక్టర్ నేత్రావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాంతరాజు, హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, జేసీఎస్ తాలూకా బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.


రొళ్లలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

సంక్షిప్త సమాచారం

ఐదుగురికి తీవ్ర గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని సి.రంగాపురం గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి ఆటోను బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆటో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. మడకశిర నుంచి ఆటోలో ప్రయాణికులు కర్ణాటక ప్రాంతం వెంకటాపురం గ్రామానికి వెళుతుండగా వెనక నుంచి బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది.

మహిళను వేధించిన వారిపై కేసు నమోదు

పెనుకొండ రూరల్: ఫోన్‌లో మహిళను వేధించిన వారిపై కేసు నమోదు చేసినట్లు కియా ఎస్‌ఐ రంగడు తెలిపారు. మండల పరిధిలోని మునిమడుగు గ్రామానికి చెందిన హరిజన సంధ్యను అదే గ్రామానికి చెందిన కొందరు ఫోన్‌లో వేధించడంతో ఆమె నాలుగు రోజుల క్రితం విషద్రావం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వేధింపులకు పాల్పడిన వారిని శుక్రవారం బంధువులు దండించడంతో వారు తిరిగి దాడికి పాల్పడ్డారు. సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొండను ఢీకొన్న కంటైనర్



పెనుకొండ: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ఓ కంటైనర్ వాహనం అదుపు తప్పి కొండను ఢీ కొంది. ఈ ఘటనలో డ్రైవర్ అన్సార్‌సాదిక్ గాయపడగా పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కంటైనర్ వాహనం బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

బార్ అసోసియేషన్‌కు సంబంధం లేదు

పెనుకొండ: పెనుకొండ కోర్టుకు సంబంధించి గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికకు స్థానిక బార్ అసోసియేషన్‌కు సంబంధం లేదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలమేరకు ఇప్పటికే బార్ అసోసియేషన్‌ను ఎన్నుకున్నామని, అయితే కొందరు న్యాయవాదులు తాజాగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం సరికాదన్నారు.

ప్రభుత్వానికి రూ.2.80 లక్షల ఆదాయం

హిందూపురం అర్బన్: సెబ్ తనిఖీల్లో పట్టుబడిన 22 వాహనాలను శుక్రవారం సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం వేశారు. అందులో 18 వాహనాలు విక్రయించగా రూ.2.80 లక్షలు వచ్చినట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. అలాగే వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో చరణ్‌రెడ్డి

పరిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సామాన్య ప్రజలే స్టార్ క్యాంపెయిన్లని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఇందులో భాగంగానే మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో దాదాపు 45 కుటుంబాలు చరణ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అల్లూరి యువసేన నాయకుడు రాజేష్‌రెడ్డితో పాటూ సిద్ధరామయ్య తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే ఎస్సీ కాలనీలో పలు కుటుంబాలు చరణ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రత్యేక పూజలు


ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బి.శాంతమ్మ, టీఎస్.దీపిక శుక్రవారం ఆలయాలు, చర్చి, మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. సూగురు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రచార కరపత్రాలతో పూజల్లో పాల్గొన్నారు. అలాగే సీఅండ్ఐజీ చర్చి, ఆర్‌పీజీటీ రోడ్డులోని మసీదు వద్ద ప్రార్థనలు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించేలా దీవెనలు అందించాలని దేవుడిని వేడుకున్నట్లు వారు పేర్కొన్నారు.

చౌడేశ్వరిదేవి విగ్రహ పునః ప్రాణ ప్రతిష్ఠ

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పునః ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక అమ్మవారిని దర్శించుకున్నారు.

అలరించిన సంకీర్తనలు


అలంకరణలో నరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ ఆవరణంలో సంకీర్తనల కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువజామున లక్ష్మీదేవి సమేత నరసింహస్వామి మూల విగ్రహానికి అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో వేదపండితుల ఆధ్వర్యంలో సంకీర్తనాలు, హరికథలు, భజనలు చేసి భక్తులను అలరించారు.

నేడు భూతప్పల ఉత్సవం

రొళ్ల పట్టణంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భూతప్పస్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి థామస్ మన్రో తోపు సమీపంలోని టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్ వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో పుట్టపర్తికి చెందిన గంగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. ఎలక్ట్రిక్ బైక్ ముందుభాగంలోని చక్రం ఊడిపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రుడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరు, మావటూరు, అడదాకులపల్లి, గోనిపేట, రాంపురం, కురుబవాండ్లపల్లి గ్రామాల్లో మంత్రి ఉషశ్రీ చరణ్ శనివారం పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు ఎన్నికల ప్రచారం

లేపాక్షి/చిలమత్తూరు: లేపాక్షి , చిలమత్తూరు మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు టీఎస్ దీపిక, శాంతమ్మలు శనివారం ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. లేపాక్షి మండలం నాయనిపల్లిలో ఉదయం 7 గంటల నుంచి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. అలాగే దేమకేతేపల్లి పంచాయతీలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రచారం ఉంటుందన్నారు.

'పురం'లో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే..


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దీపిక, శాంతమ్మ , చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్

- ఇంటింటి ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: 'ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకున్నా ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. ఈసారి హిందూపురంలోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు టీఎస్ దీపిక, బోయ శాంతమ్మ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు వలివేటి రాజారెడ్డి పర్యవేక్షణలో హిందూపురం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం హిందూపురం మండలం చెర్లోపల్లి, బాలంపల్లి, జంగాలపల్లి గ్రామ పంచాయతీల్లో ఇంటింటి ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో ఎదురువచ్చి వారికి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ నిజం చేశారన్నారు. లబ్ధిదారులు కాలు కదపకుండా సంక్షేమ ఫలాలను ఇంటిముంగిటకే తెచ్చారన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. పిల్లల చదువు భవిష్యత్తు కోసం అమ్మఒడి, రైతుల కోసం రైతు భరోసా , వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు 1వ తేదీన ఠంచన్‌గా ఇంటి వద్దకే రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా 99 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం జగనేనన్నారు.

చంద్రబాబు మోసకారి

టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో 600 హామీలిచ్చి అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టోనే చెత్తబుట్టలోకి వేశాడని విమర్శించారు. మళ్లీ మోసం చేయడానికి నోటికొచ్చిన హామీలు వస్తున్నాడన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మరోసారి ఆయనకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ప్రచారపర్వంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకురాలు మధుమతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబీవుల్లా, ఎంపీపీలు రత్నమ్మ, పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



సోమందేపల్లి: మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, రొద్దం: మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ వర్గీయులు

- మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో గెలుపొందడం ఖాయమని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నడింపల్లి, కేతగాని చెరువు, బ్రాహ్మణపల్లి, ఈదుళబలాపురం, జూలకుంట, మండ్లి, చల్లాపల్లి, మాగేచెరువు, బ్రహ్మసముద్రం గ్రామాల్లో ఆమె పర్యటించారు. పార్టీ బూత్ కమిటీ సభ్యులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని పరుగు పెట్టించారన్నారు. తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు మరోసారి టీడీపీ అండ్ కో వస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకట రత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, సర్పంచులు రామాంజి, మమతా, సౌజన్య, రామక్క, కిష్టప్ప, సోము జిలాన్‌ఖాన్, పరంధామ, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, సింగిల్ విండో డైరెక్టర్లు కొల్లప్ప, ఆదినారాయణరెడ్డి, నర్సింహులు, కంబాలప్ప, ఆదెప్ప, ఈశ్వర్, కళ్యాణ్, వలీ, నాగప్ప, మురళి, డాక్టర్‌బాబు , నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

రొద్దం: మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం సాగుతోంది. శుక్రవారం మండలంలోని కలిపి పంచాయతీ శేషాపురం గ్రామం నుంచి పలు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రవి, శివ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండల పరిధిలోని ఊటుకూరుకు చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. శుక్రవారం రాత్రి పెనుకొండలో మంత్రి ఉషశ్రీచరణ్ క్యాంప్ కార్యాలయంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఊటుకూరుకి చెందిన రత్నమ్మ, జయమ్మ, నారాయణ, వెంకటేసులు, మద్దిలేటి, గంగరత్న, రామలక్ష్మమ్మ తదితరులున్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్రరెడ్డి, శివారెడ్డి, సంజీవప్ప తదితరులు పాల్గొన్నారు.


పరిగి: టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వారితో మంత్రి ఉషశ్రీచరణ్


హిందూపురం: సీఎస్‌ఐజీ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం పొందుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దీపిక, శాంతమ్మ


గుడిబండ: చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


హిందూపురం: ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


పెనుకొండ పటణంలోని బైబిల్ చర్చిలో ...

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం 'గుడ్‌ఫ్రైడే'ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల్లో పాస్టర్లు శుభశుక్రవారం ప్రాముఖ్యతను వివరించారు. పాపులను రక్షించడం కోసమే ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించి ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రభువు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకొని జీవితాన్ని పరిశుద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయా చర్చిల్లో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని స్వీకరించి ఉపవాస దీక్షలను విరమించారు.


అగళి: శుభ శుక్రవారం ప్రాధాన్యతను వివరిస్తున్న పాస్టర్ ప్రతిభ


సోమందేపల్లి మండలం జూలకుంటలో ప్రార్థన చేస్తున్న పాస్టర్

రేపు కన్నడ సాహిత్య సమ్మేళనం

పావగడ: ఆంధ్ర గడినాడు 8వ కన్నడ సాహిత్య సమ్మేళనం ఈ నెల 31న హిందూపురంలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర గడినాడు రాజ్యాధ్యక్షుడు అంజన్‌కుమార్ తెలిపారు. హిందూపురంలోని మెచ్ కే ప్యారడైస్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం ధ్వజారోహణ, లేపాక్షి మహానంది మహాద్వారం ఉద్ఘాటన, సమ్మేళనాధ్యక్షుడి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కేంద్ర కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజ డా మహేశ్ జోశి సమ్మేళనాన్ని ప్రారంభిస్తారన్నారు. సాహితీప్రియులు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు.

1 నుంచి ఉచిత కోచింగ్

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు ఉచితంగా పాలిసెట్–2024కు కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ బాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇస్తామని, ఉచితంగా మెటీరియల్ సైతం అందిస్తామన్నారు.